


# మాతృఋణం

''నా ఋణం తీర్చుకోలేవా అమ్మా?!''

అమ్మ అడుగుతోంది.

అమ్మని అంత దీనంగా నేనెన్నడూ ఇదివరకు చూసి ఉండను. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. మనసంతా కలచినట్లయ్యింది.

***

''కలలనేవి మీ మనసులోని అంతర్గత సంఘర్షణలకు చిహ్నాలు. మీ మనసు పొరల్లో ఏ మూలనో, మీ అమ్మగారి పట్ల మీరెప్పుడో ప్రవర్తించిన తీరును గురించి గాని, అమెకు ఇవ్వలేక పోయిన ఏదో ఒక విషయము లేక వస్తువును గురించిగాని ఒక అసంతృప్తి మిగిలిపోయింది. ముందు అదేంటో ఆలోచించండి. తర్వాత ఆ విషయం ఎంత వరకు సమంజసమైనదో, ఎంత ప్రాక్టికల్లో అంచనా వేస్కోండి'' అన్నాడొక సైకాలజీ తెలిసిన మిత్రుడు.



46

నా చుట్టూ విజ్ఞాన సర్వస్వాన్ని పంచే వేలాది పుస్తకాలతో నిండిన మా బి ఈడీ కాలేజీ లైబ్రరీ. ఇక్కడే ఎన్నో పుస్తకాల్ని చదివాను. కానీ, నేను చదివిన ఏ పేజీలోనూ నా ప్రశ్నకి సమాధానం దొరికిన గుర్తులేదు.

ఇక్కడ మేం భావిభారత ఉపాధ్యాయుల్ని తయారు చేస్తాం. వాళ్ళు బయటికెళ్ళి, భావి భారత పౌరుల్ని తయారు చేస్తారు. ఇంతటి బృహత్కార్యక్రమంలో కన్నతల్లిని గురించిన ఈ ప్రశ్నకి జవాబు లేకుంటే ఎలా?

అమ్మకి నేనేం ఇచ్చాను?

అసలు, అమ్మకి నేనేమివ్వగలను?

ప్రాణం పంచి, పేగు తెంచి, అక్కణ్నుంచి నేనే ప్రాణమన్నట్లు బ్రతికిన వ్యక్తికి నేనేమిస్తే ఋణం తీరుతుంది?

నేను చదివిన పాఠాల్లో, సాహిత్యంలో, విన్న, చూసిన నాటికలు, నాటకాలు, సినిమాల్లో ఇవే ఆలోచనలూ, ప్రశ్నలూ ఎన్నిసార్లో ఎంతమందో చేశారు, వేసారు. కానీ నాకు సంతృప్తిని కల్గించే సమాధానం దొరకలేదు. ఆ ప్రశ్న ఇంకా తృప్తి పడలేదు.

***

ఎంతో మందిని అడిగేను.

ఒక్కొక్కరిదీ ఒక్కో సమాధానం.

''అమ్మ ఋణం తీర్చలేనిది. దాని గురించి బాధపడటం వల్ల ఒరిగేదీమీ లేదు'' అంటుంది నా చెల్లెలు.

నేను పెళ్లయ్యాక అత్తవారింటికెళితే అమ్మకి చివరి రోజుల్లో ఎంతో సేవ చేసిందది. దాన్ని చూస్తే నా బాధ మరింత తీవ్రమైపోతుంది. మాతృ ఋణాన్ని కొంతయినా తీర్చుకోగలిగిన ధన్యురాలు నా చెల్లెలు.

''తనకి ఆ అవకాశం వచ్చింది, చేసింది. ఒక విధంగా తను అదృష్టవంతురాలు. నీకు ఆ అవకాశం రాలేదంతే. అంతమాత్రాననువ్వేదో ద్రోహం చేసినట్లు ఎందుకా బాధ? మనసు మళ్ళించి చూడు. లోకమంతా ఎంతో అందంగా, ఆనందంగా కనిపిస్తుంది'' అంటారు మా వారు.

నిజమే కావచ్చు. కానీ, తల్లి ఋణం తీర్చుకునే అవకాశం నాకు ఎందుకు కలుగలేదూ అన్న మరో బాధ మొదలైంది నాలో!

***

''తల్లి-ఋణం ఏంటీ నాన్సెన్స్!? తల్లి దండ్రులు వాళ్ళ ఆనందం కొద్దీ పిల్లల్ని కంటారు, పెంచుతారు. ఇదొక చక్రం. ఇందులో ఋణాలూ బాకీ వసూళ్ళూ ఏంటి? మనం బాగా ఉంటే వాళ్ళు సంతోషిస్తారు. అందువల్ల మనం ఆనందంగా గడిపి, పెద్దల్ని ఆనందపరచాలి'' అంటూ తన ఫిలాసఫీని ముందుంచాడు జగ్గడు.


తెలిసిన వాళ్ళతన్ని మొండి జగ్గడంటారు. అతను మా సహాధ్యాయుడు. దత్తపుత్రుడు. కన్న వాళ్ళ ఆస్తీ,పెంచినవాళ్ళ ఆస్తీ పడేసుకుని, బాధ్య తలకి నామం పెట్టి, ఋణం తీరుస్తుంటాడు. పెళ్ళాం పిల్లల బాగోగులు కూడా అక్కర లేకుండా బలాదూర్ తిరిగే ఈ ఉత్తముడు ఎంత పరిపక్వమైన భావి ఉపాధ్యాయుల్ని తీర్చిదిద్దుతు న్నాడో నా కెప్పుడూ బెంగే!

***

''మీ అత్తగారిలోనే మీ అమ్మను చూసుకుంటే సరి. అటు ఋణమూ ఇటు రణమూ రెండూ తీరిపోతాయి'' మామగారి కొంటె సలహా. మా అత్తగారితో నాకే కాదు, ఆయనకీ చుక్కెదురే కొంతవరకు ఆయన మాటల్లోనూ నిజముంది. మనకుటుంబవ్యవస్థలో నిర్దేశించబడిన బాధ్య తల్లో వ్యక్తికీ వ్యక్తికీ మధ్య మిగిలిపోయే ఋణాలను తీర్చుకొనే మార్గం లేకపోలేదు. ఈ ఇంటి కోడలిగా నా అత్తగారిలో మా అమ్మను చూసుకొంటూ బాధ్యతలు నెరవేర్చగలిగితే, అదే సమయంలో మా అమ్మకు తన కోడలి ద్వారా సపర్యలు అందితే ఈ బాధ్యతా చక్రం పూర్తయినట్లే.

అయితే, ఈ మొత్తం వ్యవహారంపైన మాధవి వేసిన ప్రశ్నలు నన్ను ఆలోచనలోకి నెట్టాయి. మా స్టాఫ్‌లో కరడు కట్టిన ఫెమినిస్ట్ ఆమె.

మన కుటుంబ వ్యవస్థ పురుషాధిక్యాన్ని పది లపరచి, స్త్రీని పాతాళానికి తొక్కేసిన వంచక వ్యవస్థ అంటుంది మాధవి. ఈ ఒక్క అభిప్రాయంతో ఏకీభవించని నేను, కొన్ని అభిప్రాయాల్ని మాత్రం అంగీకరించేను.



అత్తగారు-కోడలి బాధ్యతల చట్రంలో కని పెంచిన తల్లి ఋణాన్ని ఇమడ్చటం ఎబ్బెట్టుగా లేదా? కోడల్ని చిత్రహింసలు పెట్టి హత్యలు చేసిన అత్తలు, అత్తల్ని జీవితాంతం వేపుకుతిన్న కోడళ్ళు ఉన్న ఆ చట్రానికి తల్లీ కూతుళ్ల బంధానికి సామీప్యం ఏమిటి?

స్త్రీని స్త్రీ డామినేట్ చేసే పరంపరని తీసుకొచ్చిన ఆ సంప్రదాయంలో తల్లి ముమ్మాటికీ ఇమడదు.

'కుపుత్రో జాయేత క్వచిదపి - కుమాతా న భవతి'

ఇది ఒక మార్గాంతరమైతే కావచ్చు. కాని ఇదొక్కటే మార్గం కాదు.

***

''నాతో రా!''

చేయిపట్టి తీసికెళ్తున్నాడతను. కుర్రాడే. మీసాలు కూడ పూర్తిగా రాలేదు. కళ్ళు పీక్కుపోయి తోతుగా గుంటలు పడివున్నాయి. ముఖం మీది చర్మం ముడుతలుపడి వుంది. అస్థి పంజరంలా ఉన్నాడు.

''ఎక్కడికి?''

''మా ప్రపంచానికి'' నూతిలోనుంచి వస్తున్నట్లు అతని గొంతు.

''ఎందుకు?''

''నీ ప్రశ్నకి సమాధానం కోసం'' గొంతులో కాస్తంత ఉత్సాహంతో అన్నాడు. కళ్ళు మాత్రం నిస్తేజంగానే ఉన్నాయి.

''ఇదేనా దారి? చీకటిగా, ఇలా చిందరవందరగా ఉందేంటి?''

''దారి కాదు. మా ప్రపంచమూ ఇలాగే ఉంటుంది చూడు'' అంటూ తలుపు తెరిచాడు ఒక ఇరుకు గది. అక్కడ ఓ పది మంది కుర్రాళ్ళు అస్తవ్యస్తంగా పడి ఉన్నారు.

''ఏమైంది వీళ్లకి? ఎవరూ ఈ లోకంలో ఉన్నట్టు లేదు''

''నువ్వన్నదే నిజం. వీళ్ళది వేరే లోకం. వెలివేయబడిన రంగుల లోకం. మాకు మేం నిర్మించుకున్న శిక్షాస్వర్గం''.

నాకు అర్థమవుతోంది. ఓ మూల సిరెంజ్‌లు. గదంతా ఏవో వాసనలు పొడర్లు డ్రగ్స్.

ముందు నాకు భయం వేసింది. తర్వాత అసహ్యం కల్గింది. నా కళ్ళలోకే నిర్భావంగా చూస్తున్న అతనిపై జాలి కలిగింది. నవ్వేందుకు ప్రయత్నించాను.

''నీ నవ్వులో మా జీవితం ఉందమ్మా. ఆ నవ్వులో లాగనే మా జీవితాల్లో కూడా జీవం లేదు''

''ఏం? ఎందుకని ఆజీవాన్ని మీకు మీరే చంపేసుకుంటున్నారు?''

''చంపేశారు!''


''ఎవరు?''

''.....''

''చెప్పు ఎవరు?''

''మధ్యన వాళ్ళేం చేశారు?''

''చెబుతాను. ముందిది చెప్పు. నీ పిల్లలు ఇప్పుడు ఏం చేస్తున్నారు?''




''పెద్దవాడు ప్రొఫెసర్. చిన్నవాడు అమెరికాలో సైంటిస్ట్. అమ్మాయి డాక్టర్''

''వాళ్ళకున్న వ్యసనాలేంటి?''

''సినిమాలు, రాత్రుళ్ళు పన్నెండింటి దాక టీవీ చూడటం''

''గంజాయి, కొకైన్?''

''బహుశా వాళ్ళు వాటిని ప్రత్యక్షంగా చూసి కూడా ఉండరు''

నవ్వేడు. ఆ నవ్వులో ఏదో అద్భుతాన్ని ఆవిష్కరించిన ఆనందం ఉంది.

''ఎందుకో తెలుసామ్మా?'' వాళ్ళకి ఆ అవసరం నువ్వు రానీయలేదు.

మాలో జేబు దొంగలు, వ్యభిచారులు, లంచగొండులు, హంతకులు, ఎన్నో రకాల నేరస్తులూ ఉన్నారు. కారణం - తల్లి ఋణం తీర్చుకోలేని మా తల్లిదండ్రులు.

మీ అమ్మగారు నిన్ను ఏ విలువలతో కని పెంచారో, వాటికి నీ జ్ఞానాన్ని జత చేసి నీ పిల్లలను తీర్చిదిద్దేవు. నీ తల్లిదండ్రులు నీకు నిజంగా ఇచ్చిన వరం ఏదైనా ఉందీ అంటే ఈ విలువలూ బాధ్యతలే.

నువ్వు వాళ్ళకి ఋణపడింది వీటికే, నువ్వే కాదు ఈ మొత్తం సమాజమంతా వాటికే ఋణపడి ఉంటుంది.

దానికి ప్రతిగా నువ్వు చేయగలిగింది ఒక్కటే నీ తదుపరి తరాన్ని మలచటం. బాధ్యతాయుతమై, సంఘాన్ని ముందుకు నడిపే మంచి తరాన్ని సృష్టించేవు. నీ తల్లి తన జీవితాన్ని ధారపోసి నీకిచ్చిన ధనాన్ని ఆ విధంగా నీ పిల్లలకు అందించావు.

మనిషి సాధించే ప్రతి ముందడుగు క్రింద వాడి తల్లిదండ్రుల తపనలు, ఆశలు, ఆశయాలు పునాదులై నిలబడతాయి. ఆ పునాదులపైన ఆ తరువాత తరం నిలబడుతుంది. నీతో నీజీవితం పూర్తయిపోలేదు. నీ మలితరానికి నువ్వే పునాది కావాలి.

అది నువ్వు సాధించేవు.

''కాదంటావా?''

''అవును నా పిల్లలు ఆణిముత్యాలు'' నా గొంతులో తృప్తి.

''ఆ ముత్యాలను రూపుదిద్దింది నువ్వే. మాతృ ఋణాన్ని ఇంతకంటే నువ్వు తీర్చేదేముంది?''

అతని కన్నుల్లోని నిర్లిప్తత వెనుక చేజారిపోతున్న ఒక తరపు ఆశలు, ఆశయాలు కనిపిస్తున్నాయి నాకు. వణుకుతున్న అతని చేతిపై నా చేతిని స్థిరంగా ఆన్చి అన్నాను.

''థాంక్యూ''

అమ్మ తృప్తిగా నవ్వుతోంది. ఆ నవ్వులపూలు బాటగా మారి నన్ను నడవమంటున్నాయి. గజిబిజిలన్నీ తొలగిపోయి, ఇన్నాళ్లుగా నా ముందు నిలుచున్న కుడ్యమేదో కరిగిపోయింది.

నా ముందు ఎన్నో బాధ్యతల శిఖరాలు.